ప్రపంచమంతా 'జంతర్ మంతర్'! సర్‌కు వ్యతిరేకంగా అనేక దేశాల్లో ప్రవాస భారతీయుల నిరసనలు 2

ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

అక్టోబర్ 19 సోమవారం 2026 | సంపుటి : 1 | సంచిక : 12 | పేజీలు : 6 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

MONDAY OCTOBER 19 2026 | VOL:1 | ISSUE: 12 | PAGES:6 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM

ఒక్క ఉద్యోగం లేదు, కోట్లాది రూపాయలు వసూలు: టోమ్‌కామ్‌పై హరీశ్ రావు ఫైర్

- జర్మనీ ఉద్యోగాల పేరిట టోమ్‌కామ్ భారీ మోసానికి పాల్పడిందన్న హరీశ్ రావు
- 70 మంది యువకుల నుంచి ఒక్కొక్కరి దగ్గర రూ.4.5 లక్షల వరకు వసూలు
- రెండేళ్లు గడిచినా ఒక్కరికీ ఉద్యోగం రాలేదని, ఇంటర్వ్యూ కూడా జరగలేదని ఆరోపణ
- బాధితులకు నష్టపరిహారం ఇచ్చి, సీఐడీ విచారణ జరపాలని బీఆర్ఎస్ డిమాండ్
- టోమ్‌కామ్ ఫీజులు, ఇచ్చిన ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని విజ్ఞప్తి



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రభుత్వ ఆధ్వర్యంలోని టోమ్‌కామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ) నిరుద్యోగ యువతను దోచుకునే ఓ పెద్ద రాకెట్‌గా మారిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. జర్మనీలో ఉద్యోగాల పేరు చెప్పి 70 మందికి పైగా యువకుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి, వారిని నట్టేట ముంచారని సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.హరీశ్ రావు ఆరోపణల ప్రకారం, సుమారు 15 జిల్లాల నుంచి 70-75 మంది నిరుద్యోగ యువకుల నుంచి టోమ్‌కామ్ ఒక్కొక్కరి దగ్గర రూ.4.10 లక్షల చొప్పున వసూలు చేసింది. పరీక్షలు, ఇన్సూరెన్స్, వీసా ఖర్చులతో కలిపి ఇది ఒక్కో అభ్యర్థికి దాదాపు రూ.4.5 లక్షలకు చేరిందని ఆయన వివరించారు. పేద రైతు కుటుంబాలకు చెందిన వారు తమ ఇంట్లోని మహిళల బంగారాన్ని తాకట్టు పెట్టి, అప్పులు చేసి ఈ డబ్బు కట్టారని, రెండేళ్లు గడిచినా ఉద్యోగాలు రాకపోవడంతో ఇంకా వడ్డీలు చెల్లిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రెండేళ్లు దాటినా, బాధితుల్లో ఒక్కరిని కూడా ఒక్క జర్మన్ కంపెనీ కూడా ఇంటర్వ్యూ చేయలేదని హరీశ్ రావు తెలిపారు. జర్మన్ భాషలో బీ1 పరీక్ష పాసైన వారిని, ఇప్పుడు బీ2 పాస్ కావాలని చెప్పి కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. వీరిలో తొమ్మిది మంది జర్మనీకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారంటూ టోమ్‌కామ్ ప్రచారం చేసుకున్నా, ఒక్కరు కూడా వెళ్లలేదని స్పష్టం చేశారు. ఈ అభ్యర్థులతో కుదుర్చుకున్న ఒప్పందంలో ఏదైనా వివాదం తలెత్తితే

భారత్ మాకు ముఖ్య మిత్రదేశం: రష్యా ఆయిల్ కొనుగోళ్లపై అమెరికా కీలక వ్యాఖ్యలు

- రష్యా ఇంధన కొనుగోళ్లపై ఆంక్షల నుంచి భారత్‌కు తాత్కాలిక మినహాయింపు
- 60 రోజుల పాటు మినహాయింపు ఇస్తున్నట్టు ప్రకటించిన ట్రంప్ ప్రభుత్వం
- భారత్ ఒక్కసారిగా మారడం కష్టమని అమెరికా వ్యాఖ్య
- భవిష్యత్తులో టారిఫ్‌ల ముప్పు పూర్తిగా తొలగిపోలేదని సంకేతాలు

భారత్ అమెరికాకు అత్యంత ముఖ్యమైన మిత్రదేశమని, ఇంధన అవసరాల కోసం రష్యాపై ఆధారపడటాన్ని ఒక్క రోజులో మార్చుకోవడం కష్టమని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో వ్యాఖ్యానించారు. రష్యా నుంచి భారీగా ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటున్న భారత్‌కు అమెరికా తాత్కాలిక ఊరట కల్పిస్తూ అమెరికా నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో రుబియో ఈ (మిగతా 2వ పేజీలో..)



పండగ పూట ఛార్జీల బాదుడు.. ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్

- పండగ స్పెషల్ బస్సుల ఛార్జీల పెంపుపై హరీశ్ రావు విమర్శలు
- సాధారణ బస్సులనే స్పెషల్స్‌గా నడుపుతూ అధిక ఛార్జీలు వసూలు
- స్పెషల్ బస్సులపై 50 శాతం సర్‌ఛార్జి మాత్రమేనంటున్న టీజీఎస్ఆర్టీసీ

(మిగతా 2వ పేజీలో..)





అరెస్టులకు భయపడం.. సుదీర్ఘ పోరాటానికి సిద్ధమే

సీజేపీ చీఫ్ అభిజీత్ దీప్కే

న్యూఢిల్లీ : అరెస్టులకు భయపడేది లేదని, తాము సుదీర్ఘ పోరాటానికి నిర్ణయించుకునే వచ్చామని కాక్రోచ్ జనతా పార్టీ చీఫ్ అభిజీత్ దీప్కే చెప్పారు. ఆదివారం ఓ జాతీయ మీడియాతో అభిజీత్ మాట్లాడుతూ.. 'మేం ఎవరికీ భయపడం. మా పోరాటాన్ని ఆపేది లేదు. సౌరవ్, ఆశుతోష్ రాంకా విడుదలైన తర్వాత పార్టీ సభ్యులం సమావేశమై తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటాం. ఆదివారమే వాళ్లను విడుదల చేస్తారని ఆశిస్తున్నాం. (మిగతా 2వ పేజీలో..)

ఎన్హెచ్ఎం ఉద్యోగుల జీతాల్లో కోత.. ప్రభుత్వంపై కవిత ఫైర్

- జీతాలు తగ్గిస్తూ ఇచ్చిన జీవో 1195ను రద్దు చేయాలని కవిత డిమాండ్
- కొందరి ఉద్యోగులకు రూ.4,000 నుంచి రూ.5,000 వరకు జీతాలు తగ్గాయని ఆరోపణ
- సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక



నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల జీతాలను తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 1195పై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అత్యంత అన్యాయమైన చర్య అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని ఈ నిర్ణయాన్ని సమీక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఎన్హెచ్ఎం ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17,000 మంది ఎన్హెచ్ఎం ఉద్యోగులు పనిచేస్తుండగా, తాజా జీవో కారణంగా కొందరి జీతాల్లో రూ.4,000 నుంచి రూ.5,000 వరకు కోత పడిందని కవిత ఆరోపించారు. ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుతున్న ఈ క్లిష్ట సమయంలో జీతాలు తగ్గించడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కొందరికి జీతాలు పెంచి, మరికొందరికి తగ్గించడంలో వివక్ష కనిపిస్తోందని ఆమె విమర్శించారు. కేంద్రం ఎన్హెచ్ఎం జీతాల కోసం నిధులు ఇస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం వాటిని సకాలంలో విడుదల చేయడం లేదని ఆరోపించారు.ఎన్నికల ముందు ఎన్హెచ్ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు వారికి న్యాయం చేయడం లేదని కవిత విమర్శించారు. కాంగ్రెస్ పాలిత హిమాచల్ ప్రదేశ్‌తో సహా ఏడు రాష్ట్రాలు ఇప్పటికే (మిగతా 2వ పేజీలో..)



పూల పండుగకు పులకించిన తెలంగాణ!

రాష్ట్రవ్యాప్తంగా వైభవంగా సద్దుల బతుకమ్మ సంబురాలు

ట్యాంక్‌బండ్‌పై 700 మంది కళాకారుల ప్రదర్శనలు

బతుకమ్మ ఆడిన గవర్నర్ సతీమణి జానకి, మంత్రి సీతక్క

సినీనటి రష్మిక

తెలంగాణ కోడలిగా బతుకమ్మ ఆడటం సంతోషంగా ఉందన్న రష్మిక

పెరిక‌శింగారంలో 55 అడుగుల భారీ బతుకమ్మ

భిక్కనూరు మండలంలో నిమజ్జనం వేళ విషాదం.. నీట మునిగి వ్యక్తి మృతి

పల్లెపల్లెనా పూల సందడి

హైదరాబాద్: తెలంగాణ (మిగతా 2వ పేజీలో..)



నకిలీ ఓట్లతో గెలువాలని చూస్తున్న బీజేపీ

ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆరోపణలు

లక్నో: ఓటర్ల జాబితాలో నకిలీ ఓట్లను చేర్చడంతో పాటు ప్రతిపక్షాల మద్దతుదారుల ఓట్లను తొలగించి బీజేపీ గెలువాలని చూస్తున్నదని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. లక్నోలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం అఖిలేశ్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'నకిలీ ఓట్లను చేర్చి, మన పార్టీ మద్దతుదారుల ఓట్లను తొలగించి గెలిచేందుకు బీజేపీ కుట్రలు చేస్తున్నది. కాబట్టి పోలింగ్ బూత్‌ల వద్ద ఉన్న కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి. ఫేక్ ఓట్లు కనిపిస్తే వెంటనే తొలగించేలా ఫిర్యాదులు చేయాలి' అని చెప్పారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్)ను సీఈసీ ప్రకటించిన కొద్ది రోజులకే అఖిలేశ్ ఈ ఆరోపణలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

23న దేశవ్యాప్తంగా ప్రజామార్చ్

'పీపుల్ అగైనెస్ట్ సర్' కూటమి పిలుపు

న్యూఢిల్లీ : సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా అక్టోబర్ 23న ప్రజామార్చ్ నిర్వహించనున్నట్టు 'పీపుల్ అగైనెస్ట్ సర్' కూటమి ఆదివారం ప్రకటించింది. సర్‌ను రద్దు చేయడంతో పాటు ఇప్పటి వరకు తొలగించిన ఓట్లను పునరుద్ధరించడం తమ ప్రధాన డిమాండ్ అని తెలిపింది. ప్రతి రాష్ట్రంలోని (మిగతా 2వ పేజీలో..)



నేడు ఫ్యూచర్ సిటీకి సీఎం రేవంత్



హైదరాబాద్, ఇబ్రహీంపట్నం, అక్టోబరు 18 :

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఫ్యూచర్ సిటీకి వెళ్లనున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఫ్యూచర్‌సిటీ పోలీస్ కమిషనరేట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. ఆ తరువాత యాచారం మండలం మంగలితండా వద్ద నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐయుఎం) క్యాంపస్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీని సందర్శిస్తారు. ఆ ప్రాంగణంలోనే నిర్వహించబోయే ఇన్వెస్ట్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడనున్నారు. అక్కడి నుంచి ఫ్యూచర్‌సిటీ డెవల్‌పమెంట్ అథారిటీ కార్యాలయానికి చేరుకుని పనులపై సమీక్షించనున్నారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ఎన్నెచ్ఎం ఉద్యోగుల జీతాల్లో కోత.. ప్రభుత్వంపై కవిత ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నెచ్ఎం సిబ్బందిని పర్మినెంట్ చేశాయని గుర్తుచేశారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా 30 శాతం జీతాలు పెంచి, వారిని క్రమబద్ధీకరించాలని అసెంబ్లీలో తీర్మానం చేసిందన్నారు. గ్రామీణ ఆరోగ్య వ్యవస్థ, వ్యాక్సినేషన్ కార్యక్రమాల్లో ఎన్నెచ్ఎం ఉద్యోగుల పాత్ర కీలకమని కవిత నొక్కి చెప్పారు. ఉద్యోగులు నిరసన తెలిపేందుకు అనుమతి నిరాకరించడం, ఆరోగ్య మంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు పెంచడంతో పాటు, ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, ఉద్యోగులకు మద్దతుగా తమ సంస్థ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని ఆమె హెచ్చరించారు.

అరెస్టులకు భయపడం.. సుదీర్ఘ పోరాటానికి సిద్ధమే

(మొదటి పేజీ తరువాయి)

ఒకవేళ చేయకపోతే న్యాయపరమైన పోరాటానికి దిగుతాం. సుదీర్ఘ పోరాటానికి సిద్ధపడే వచ్చాం. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేదాకా వదిలిపెట్టేది లేదు' అని అభిజీత్ పేర్కొన్నారు.

పండగ పూట ఛార్జీల బాదుడు.. ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

బతుకమ్మ, దసరా పండగల వేళ తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ ఛార్జీలు పెంచి ప్రజలపై తీవ్ర భారం మోపుతోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. పండగకు సొంతూళ్లకు వెళ్లేవారి ఉత్సాహాన్ని ఈ ఛార్జీల పెంపు దెబ్బతీసిందని ఆయన ఆరోపించారు. ఛార్జీల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.సాధారణ సర్వీసులను తగ్గించి, వాటినే పండగ స్పెషల్ బస్సులుగా చూపిస్తూ అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు సాధారణ టికెట్ ధర రూ. 230 ఉండగా, ఇప్పుడు రూ. 400 వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే మహబూబ్‌నగర్ నుంచి ఎంజీబీఎస్‌కు రూ. 220 ఉన్న టికెట్‌ను రూ. 290కి పైగా పెంచారని తెలిపారు. ఇదేనా మీ ప్రజా పాలన? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.అయితే, ఈ ఛార్జీల పెంపు కేవలం పండగ రద్దీ కోసం నడుపుతున్న 7,000 ప్రత్యేక బస్సులకు మాత్రమే వర్తిస్తుందని టీజీఎస్ఆర్టీసీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. సాధారణ సర్వీసుల్లో ఛార్జీలు యథాతథంగానే ఉన్నాయని తెలిపాయి. పండగ సమయంలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చిన తర్వాత బస్సులు ఖాళీగా తిరిగి రావడం వల్ల అయ్యే నిర్వహణ ఖర్చులను భర్తీ చేసేందుకు ఈ 50 శాతం సర్‌ఛార్జి విధిస్తున్నట్లు అధికారులు వివరిస్తున్నారు.2003లో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వు (జీవో ఎంఎస్ నెం. 16) ప్రకారమే ఈ సర్‌ఛార్జిని వసూలు చేస్తున్నామని, ఇది కొత్త విధానం కాదని టీజీఎస్ఆర్టీసీ చెబుతోంది. అయినప్పటికీ, పండగ వేళ ఛార్జీల పెంపు సరైంది కాదని ప్రతిపక్షాలు విమర్శిస్తుండటంతో ఈ అంశంపై రాజకీయంగా చర్చ మొదలైంది.

23న దేశవ్యాప్తంగా ప్రజామార్చ్

(మొదటి పేజీ తరువాయి)

అన్ని జిల్లాలు, మండలాల్లో రైతులు, యువకులు, ప్రజాసంఘాల లీడర్లు, మేధావులు, కార్మిక సంఘా లు, విద్యార్థులు జెండాలు పట్టుకుని నిరసనల్లో పాల్గొనాలని కూటమి కోరింది. హర్ హాత్ మే తిరంగా, హర్ గలీ జంతర్‌మంతర్ నినాదాలతో మార్చ్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చింది. ఈ కూటమిలో నటుడు ప్రకాశ్ రాజ్, కిసాన్ సభ నాయకుడు కృష్ణ ప్రసాద్, సీపీఐ (ఎంఎల్) నాయకుడు సాయిబాలాజీ ఉన్నారు.

ప్రపంచమంతా 'జంతర్ మంతర్'! సర్‌కు వ్యతిరేకంగా అనేక దేశాల్లో ప్రవాస భారతీయుల నిరసనలు

సర్‌కు వ్యతిరేకంగా అనేక దేశాల్లో ప్రవాస భారతీయుల నిరసనలు

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌కు వ్యతిరేకంగా భారత్‌లో జరుగుతున్న నిరసనలకు మద్దతుగా ప్రపంచవ్యాప్తంగా ప్రవాస భారతీయులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఎన్నికల పారదర్శకత, ఓటు హక్కు కోసం 'ప్రతి చోటా జంతర్‌మంతర్' పేరిట వివిధ దేశాల్లో వీధుల్లోకి వచ్చారు.అక్టోబర్ 16న లండన్, జర్మనీలోని ఎర్లాంగెన్‌లో ప్రారంభమైన నిరసనలు మరుసటి రోజు జర్మనీ, ఐర్లాండ్, నెదర్లాండ్స్, స్వీడన్, ఫిన్‌లాండ్, కెనడా, అమెరికా, చెక్ రిపబ్లిక్‌లోని పలు నగరాలకు విస్తరించాయి. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్, సిడ్నీ, బ్రిస్బేన్‌తోపాటు న్యూయార్క్‌లోనూ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు.

లండన్‌లో భారత హైకమిషన్ ఎదుట..

స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో లండన్‌లోని భారత హైకమిషన్ ఎదుట నిరసన ప్రదర్శన జరిగింది. ఎన్నికల సమగ్రత కాపాడాలని, సీఈసీ రాజీనామా చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. పార్లమెంట్ స్క్వేర్‌లో జరిగిన మరో ప్రదర్శనలో యూట్యూబర్ ధ్రువ్‌పాల్గొన్నారు.

కెనడా, ఐర్లాండ్‌లో సంఘీభావం

టొరంటోలోని భారత కాన్సులేట్ ఎదుట నిరసనకారులు భారత రాజ్యాంగాన్ని చదివి, ప్రజాస్వామ్య పరిరక్షణకు నినాదాలు చేశారు. వాంకోవర్‌లోనూ సుమారు 50 మంది సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. డబ్లిన్‌లో సౌత్ ఏషియా కలెక్టివ్ ఐర్లాండ్ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల పేర్లు తొలగింపు, వివరాల్లో మార్పులపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఓటు హక్కు కాపాడాలని డిమాండ్ చేశారు.

అమెరికా, నెదర్లాండ్స్‌లోనూ ప్రదర్శనలు

నెదర్లాండ్స్‌లోని ది హేగ్‌లో అంతర్జాతీయ న్యాయస్థానం ఎదుట 150 మందికిపైగా సమావేశమై భారత్‌లో నిరసన చేస్తున్నవారికి మద్దతు తెలిపారు. అమెరికాలోని ఫిలడెల్ఫియా, లాస్ ఏంజెలెస్ తదితర నగరాల్లోనూ ప్రదర్శనలు జరిగాయి. న్యూయార్క్‌లో జర్నలిస్టులు, రచయితలు, న్యాయవాదులు, మానవ హక్కుల కార్యకర్తలు పాల్గొని సంఘీభావ ర్యాలీ నిర్వహించారు.



ఒక్క ఉద్యోగం లేదు, కోట్లాది రూపాయలు వసూలు: టోమ్‌కామ్‌పై హరీశ్ రావు ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

1,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్నో కోర్టులో తేల్చుకోవాలని నిబంధన పెట్టడం దారుణమని అన్నారు. టోమ్‌కామ్ ద్వారా ఇప్పటివరకు ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయో చెప్పాలని ఆర్టీఐ ద్వారా అడిగినా, గడువు ముగిసినా సమాధానం ఇవ్వడం లేదని విమర్శించారు.బాధితులు రెండేళ్లుగా ఎదురుచూస్తుంటే, ఈ ఏడాది జూన్‌లో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి కొత్త టోమ్‌కామ్ బ్యాచ్‌ను ప్రారంభించి ఉద్యోగ హామీలు ఇవ్వడం బాధితులను అవమానించడమేనని హరీశ్ రావు దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు.ఈ మోసానికి పాల్పడిన టోమ్‌కామ్, ఫెయిర్‌స్టీట్ ఇండియా సంస్థల నుంచి వసూలు చేసిన ప్రతి రూపాయిని బాధితులకు తిరిగి చెల్లించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. వారు కోల్పోయిన రెండేళ్ల కాలానికి, వడ్డీ భారం, మానసిక వేదనకు నష్టపరిహారం అందించాలన్నారు. బాధితులందరికీ ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని, ఈ వ్యవహారంపై తక్షణమే సీఐడీ లేదా జ్యుడీషియల్ విచారణ జరిపి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ఫీజుల వసూళ్లు, కల్పించిన ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హరీశ్ రావు తన పోస్టులో స్పష్టం చేశారు.

భారత్ మాకు ముఖ్య మిత్రదేశం: రష్యా ఆయిల్ కొనుగోళ్లపై అమెరికా కీలక వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యలు చేశారు. రష్యాపై విధించిన ఆంక్షల చట్టం నుంచి భారత్ సహా కొన్ని దేశాలకు 60 రోజుల పాటు మినహాయింపు ఇస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం 'లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్' కింద ఈ వెయివర్‌పై సంతకం చేశారు. ఈ చట్టం ప్రకారం, రష్యా నుంచి అధిక మొత్తంలో చమురు, గ్యాస్ కొనుగోలు చేసే టాప్ 5 దేశాల (భారత్, చైనా సహా) నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే వస్తువులపై 100 శాతం వరకు టారిఫ్‌లు విధించే అధికారం ఉంది. అయితే, జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ట్రంప్ ఈ నిబంధనలను తాత్కాలికంగా నిలిపివేశారు.శనివారం వాషింగ్టన్‌లో విలేకరులతో మాట్లాడిన మార్కో రుబియో, ఈ నిర్ణయం వెనుక గల కారణాలను వివరించారు. "ఈ ఆంక్షలు కేవలం రష్యాపైనే కాదు. భారత్ వంటి ఇతర దేశాలపైనా టారిఫ్‌ల రూపంలో ప్రభావం చూపుతాయి. అందుకే అధ్యక్షుడు 60 రోజుల సమయం తీసుకుని, ప్రపంచ, అమెరికా ఆర్థిక వ్యవస్థలపై పడే ప్రభావాన్ని అధ్యయనం చేయాలని భావిస్తున్నారు" అని తెలిపారు. భారత్ ఇంధన వనరులను వైవిధ్యపరుచుకుంటున్నప్పటికీ, రష్యా నుంచి ఇంకా గణనీయమైన మొత్తంలో ఇంధనాన్ని కొనుగోలు చేస్తోందని, ఇది ఒక్కరోజులో మారే ప్రక్రియ కాదని ఆయన స్పష్టం చేశారు.ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా నుంచి చౌకగా ముడి చమురు లభించడంతో భారత్ భారీగా దిగుమతులను పెంచుకుంది. ప్రస్తుతం భారత్‌కు రష్యానే అతిపెద్ద చమురు సరఫరాదారుగా ఉంది. అయితే, తమ ఇంధన భద్రత కోసం వివిధ దేశాల నుంచి మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా కొనుగోళ్లు జరుపుతామని భారత్ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసింది. ప్రస్తుతం ఉజ్బెకిస్థాన్, భారత్ పర్యటనలో ఉన్న రుబియో, భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో సమావేశమై, జామ్‌నగర్‌లోని రిఫైనరీని సందర్శించనున్నారు. ఈ 60 రోజుల అధ్యయనం తర్వాత అమెరికా తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతానికి ఈ మినహాయింపు భారత్‌కు ఉపశమనం కలిగించినప్పటికీ, భవిష్యత్తులో టారిఫ్‌ల ముప్పు పూర్తిగా తొలగిపోలేదని విశ్లేషకులు భావిస్తున్నారు.

పూల పండుగకు పులకించిన తెలంగాణ!

(మొదటి పేజీ తరువాయి)

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం వైభవంగా జరిగాయి. సాయంత్రం వేళ రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు ఇళ్ల నుంచి వీధుల్లోకి చేరాయి. అందంగా అలంకరించిన ముగ్గులపై బతుకమ్మలను కొలువుదీర్చి మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. ఉయ్యాల పాటలు, కోలాటాలు, డప్పుల మోతలతో పల్లెలు, పట్టణాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. సాయంత్రం నుంచి రాత్రి వరకు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపిన మహిళలు, అనంతరం చెరువులు, కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేసి సద్దులను స్వీకరించారు.

ట్యాంక్‌బండ్‌పై అంబరాన్నంటిన సంబురాలు

హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యుద్దీపాల అలంకరణలు, పోతురాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాలు, సుమారు 700 మంది కళాకారుల ప్రదర్శనలు ఉత్సవాలకు మరింత వైభవాన్ని తీసుకొచ్చాయి. హుస్సేన్‌సాగర్ పరిసరాల్లో నిర్వహించిన లేజర్ షో, బాణసంచా ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.ఈ వేడుకలకు గవర్నర్ శివప్రసాద్ శుక్లా, ఆయన సతీమణి జానకీ శుక్లా, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి సీతక్క, సినీనటులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న, గీత రచయిత సుద్దాల అశోక్ తేజ తదితరులు హాజరయ్యారు.

ఐకమత్యానికి ప్రతీక బతుకమ్మ

బతుకమ్మ పండుగ కులమతాలకు అతీతంగా ప్రజలను ఒకచోట చేర్చే గొప్ప సంప్రదాయమని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. వివిధ రకాల పూలను ఒకచోట చేర్చి అమ్మవారిని ఆరాధించడం ఈ పండుగ ప్రత్యేకత అని తెలిపారు. ప్రజల మధ్య ఐకమత్యం, సోదరభావం పెంపొందించడంలో బతుకమ్మ వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు.చెరువులు, చేలను పరిరక్షించుకోవాలనే సందేశాన్ని బతుకమ్మ పండుగ అందిస్తుందని మంత్రి సీతక్క అన్నారు. మహిళలు సమూహంగా చేరి పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ ఉత్సాహంగా గడపడం వల్ల శారీరక చురుకుదనం, మానసిక ఉల్లాసం పెరుగుతాయని వివరించారు.

బతుకమ్మ ఆడిన జానకీ శుక్లా, సీతక్క, రష్మిక

ట్యాంక్‌బండ్‌పై జరిగిన వేడుకల్లో గవర్నర్ సతీమణి జానకీ శుక్లా, మంత్రి సీతక్క, సినీనటి రష్మిక మందన్న బతుకమ్మ ఆడారు. మహిళలతో కలిసి సంప్రదాయ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. సినీనటులు విజయ్ దేవరకొండ, రష్మిక హాజరు కావడంతో అభిమానుల్లోనూ ఉత్సాహం నెలకొంది.

తెలంగాణ పండుగలంటే ఎంతో ఇష్టం: విజయ్

తెలంగాణ పండుగలంటే తనకు ఎంతో ఇష్టమని సినీనటుడు విజయ్ దేవరకొండ తెలిపారు. ముఖ్యంగా బోనాలు, బతుకమ్మ వేడుకలంటే మరింత అభిమానమని చెప్పారు. ఫిబ్రవరిలో వివాహం జరిగిన సందర్భంగా తెలంగాణలో జరిగే పెద్ద బతుకమ్మ వేడుకల్లో పాల్గొనాలని రష్మికకు అప్పుడే చెప్పినట్లు వెల్లడించారు. ఆ మాట ప్రకారమే ఆమెను ట్యాంక్‌బండ్‌పై జరిగిన ఉత్సవాలకు తీసుకొచ్చానని తెలిపారు.

తెలంగాణ కోడలిగా రావడం సంతోషంగా ఉంది: రష్మిక

తాను తెలంగాణ కోడలినని, రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాల్లో భాగస్వామ్యం కావడం ఎంతో సంతోషంగా ఉందని సినీనటి రష్మిక మందన్న అన్నారు. పెళ్లి తర్వాత తెలంగాణలో జరిగే పెద్ద బతుకమ్మ పండుగలో పాల్గొని బతుకమ్మ ఆడాలని విజయ్ చెప్పారని, అందుకే ఈ వేడుకలకు వచ్చినట్లు వివరించారు. గతంలో తనను 'మేడం' అని పిలిచేవారని, ఇప్పుడు 'వదినా' అని ఆప్యాయంగా పిలుస్తున్నారని పేర్కొన్నారు. తనపై ప్రజలు చూపిస్తున్న ప్రేమాభిమానాలు ఎప్పటికీ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు.

ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. హనుమకొండలో పద్మాక్షి ఆలయం వద్ద వేలాది మంది మహిళలు పాల్గొన్నారు. వరంగల్‌లోని పోతన ఆడిటోరియం, భద్రకాళి ఆలయ ప్రాంగణం, ఉర్సు కరీమాబాద్‌లోని రంగలీలా మైదానం, వరంగల్ కోట, కాజీపేటలోని వడ్డెపల్లి చెరువుకట్ట, కాశీబుగ్గలోని కోటిలింగాల దేవాలయ ప్రాంగణాల్లో ఉత్సవాలు నిర్వహించారు. మాజీ మంత్రి కొండా సురేఖ హనుమకొండ రాంనగర్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో నిర్వహించిన బతుకమ్మ సంబురాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు.

అంబులెన్స్‌కు దారి ఇచ్చి మానవత్వం చాటిన మహిళలు

నిజామాబాద్ జిల్లా బోర్గాంలో బతుకమ్మ ఆడుతున్న సమయంలో అటుగా అంబులెన్స్ రావడంతో మహిళలు వెంటనే బతుకమ్మలను పక్కకు జరిపి వాహనానికి దారి ఇచ్చారు. పండుగ సందడిలోనూ అత్యవసర సేవలకు ఆటంకం కలగకుండా వ్యవహరించి తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు.

నాలుగు క్వింటాళ్ల పూలతో 55 అడుగుల బతుకమ్మ

ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పెరికశింగారం గ్రామంలో 55 అడుగుల భారీ బతుకమ్మను రూపొందించారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు, విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఈ బతుకమ్మను పేర్చారు. ఇందుకోసం నాలుగు క్వింటాళ్ల పూలను వినియోగించారు. 25 మంది సుమారు పది గంటలపాటు శ్రమించి బతుకమ్మను సిద్ధం చేశారు. గ్రామంలో గత 25 ఏళ్లుగా భారీ బతుకమ్మను పేర్చడం ఆనవాయితీగా కొనసాగుతోంది.

బతుకమ్మ నిమజ్జనం వేళ విషాదం

కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం తిప్పాపూర్‌లో బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా విషాదం చోటుచేసుకుంది. ధర్మగల్ల స్వామి (40) అనే ఆర్టీసీ డ్రైవర్ కుటుంబసభ్యులతో కలిసి వేడుకలకు హాజరయ్యారు. బతుకమ్మను నిమజ్జనం చేసే సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడిపోయారు. కొద్దిసేపటి తర్వాత ఆయనను బయటకు తీసినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు సమాచారం. స్వామికి భార్య శ్యామల, కుమార్తె, కుమారుడు, తల్లిదండ్రులు ఉన్నారు. పండుగ వేళ జరిగిన ఈ ఘటనతో కుటుంబసభ్యులు, స్థానికులు విషాదంలో మునిగిపోయారు.

'వెన్నుపోటు' కాంగ్రెస్‌తో కలిసి పనిచేయం.. సీజేపీ నిరసనలకు స్టాలిన్ మద్దతు

సీజేపీ నిరసనలకు స్టాలిన్ మద్దతు

చెన్నై, అక్టోబర్ 17: ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా రాజకీయ నిరసనలకు నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నుంచి దూరం పాటిస్తూనే ఓటర్లజాబితా ప్రత్యేక సమగ్ర సమీక్ష(సర్), ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నిరసనలకు డీఎంకే తన మద్దతును ప్రకటించింది. శనివారం డీఎంకే అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన జరిగిన పార్టీ ఎంపీల సమావేశంలో తమ రాజకీయ వైఖరిని స్పష్టం చేశారు. సర్ విషయంలో కాంగ్రెస్, అధికార టీవీకే పార్టీలు ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నాయని ఆరోపిస్తూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని, సర్‌ను రద్దు చేయాలని, బ్యాలెట్ పేపర్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేయాలని ఈ సమావేశం తీర్మానించింది. శుక్రవారం చెన్నైలో నిరసనలో పాల్గొన్న అనంతరం డీఎంకే ఉప ప్రధాన కార్యదర్శి, పార్లమెంటరీ పార్టీ నాయకురాలు కనిమొళి కరుణానిధి ఈ ప్రకటనలు చేశారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

నడికూడలో అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు

నడికూడ, అక్టోబర్ 18 (ప్రజానేస్తం జ్వాల):

నడికూడ మండల కేంద్రములో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలను నడికూడలో ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ సందడి చేశారు.పూల పండుగతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించడం విశేషం. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేసి, కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని మహిళలు ప్రార్థించారు. ఈ వేడుకల్లో సర్పంచ్ మలహాల్ రావు, గ్రామ కార్యదర్శి, గ్రామ మహిళలు, యువతులు, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.



27 ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరిన స్నేహితులు!

- **కీతవారిగూడెంలో 1998--99 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం**
- **చిన్ననాటి జ్ఞాపకాలకు మళ్లీ జీవం.. గురువులకు ఘన సత్కారం.. స్నేహబంధానికి అరుదైన వేడుక!**

కీతవారిగూడెం (ప్రజానేస్తం జ్వాల):

కాలం మారింది.. చదువులు పూర్తయ్యాయి.. ఉద్యోగాలు, వ్యాపారాలు, కుటుంబ బాధ్యతలతో ఎవరి జీవితాల్లో వారు బిజీ అయ్యారు. కానీ చిన్ననాటి స్నేహం మాత్రం చెక్కుచెదరలేదు! అక్షరాలు నేర్చిన పాఠశాల.. ఆటపాటలతో గడిపిన తరగతి గదులు.. గురువుల మందలింపులు.. స్నేహితులతో పంచుకున్న మధుర జ్ఞాపకాలు.. ఇవన్నీ మరోసారి కళ్లముందు కదలాడాయి. దాదాపు 27 ఏళ్ల విరామం తర్వాత కీతవారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998--99 విద్యా సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒక్కచోట చేరి ఆత్మీయ సమ్మేళనాన్ని ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకున్నారు.

పలకరింపుల్లో ఆప్యాయత.. జ్ఞాపకాల్లో ఆనందం!

ఏళ్ల తర్వాత కలుసుకున్న మిత్రులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాల రోజుల్లో చేసిన అల్లరి, తరగతి గదుల్లో సాగిన సరదాలు, ఉపాధ్యాయుల బోధనలు, పరీక్షల సమయంలో ఎదురైన అనుభవాలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. అప్పట్లో సహవిద్యార్థులుగా ఉన్నవారు నేడు వివిధ రంగాల్లో స్థిరపడినా.. కలుసుకున్న క్షణంలో మాత్రం మళ్లీ విద్యార్థి దశలోకి వెళ్లిన అనుభూతిని పొందారు. ఒకరినొకరు పలకరించుకుంటూ, కష్టసుఖాలను పంచుకుంటూ ఆత్మీయతను చాటుకున్నారు.

గురువులకు ఘన సత్కారం.. కృతజ్ఞతకు నిలువెత్తు నిదర్శనం!

తమకు విద్యాబుద్ధులు నేర్పి, జీవితానికి బాటలు వేసిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. గురువుల మార్గదర్శకత్వం తమ ఎదుగుదలకు పునాది అని గుర్తుచేసుకున్నారు. విద్యార్థుల విజయాల వెనుక ఉపాధ్యాయుల కృషి, ఆశీస్సులు ఎంతో కీలకమని కొనియాడారు.



స్నేహానికి వయసు లేదు.. జ్ఞాపకాలకు ముగింపు లేదు!

27 ఏళ్ల తర్వాత జరిగిన ఈ కలయిక కేవలం సమ్మేళనం కాదు.. మధుర జ్ఞాపకాల పునఃస్మరణ, స్నేహబంధాల పునరుద్ధరణ, గురువుల పట్ల కృతజ్ఞతను చాటే అపురూప వేడుక! జీవిత ప్రయాణంలో ఎంత ఎత్తుకు ఎదిగినా తమ మూలాలను, పాఠశాల అనుబంధాన్ని మరిచిపోకూడదనే సందేశాన్ని ఈ కార్యక్రమం అందించింది. భవిష్యత్తులోనూ ఇలాంటి సమ్మేళనాలు నిర్వహిస్తూ స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని పూర్వ విద్యార్థులు ఆకాంక్షించారు.

కొత్తకొండ వీరభద్రస్వామిని దర్శించుకున్న అడిషనల్ కలెక్టర్ కె. వెంకటరెడ్డి

- **కుటుంబ సమేతంగా స్వామివారికి అభిషేకం.. అమ్మవారికి కుంకుమార్చన**

భీమదేవరపల్లి, అక్టోబర్ 18 (ప్రజా నేస్తం జ్వాల):

భద్రకాళి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో భక్తి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ కె. వెంకటరెడ్డి ఆదివారం కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన గావించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను దేవస్థాన కార్యనిర్వహణ అధికారి పి. కిషన్‌రావు పర్యవేక్షించారు. శరన్నవరాత్రి ఉత్సవాల వేళ ప్రముఖులు, భక్తులు స్వామివారిని దర్శించుకోవడంతో ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.



దేవునూరులో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ.. మహిళలు, ప్రజల ఉత్సాహభరిత భాగస్వామ్యం

ధర్మసాగర్, అక్టోబర్ 18 (ప్రజానేస్తం జ్వాల):

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం దేవునూరు గ్రామంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో మహిళలు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పూల పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.తెలంగాణ ఆడపడుచులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ పండుగ ప్రకృతి ఆరాధనకు, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుంది. తొమ్మిది రోజులపాటు సాగే ఈ పూల పండుగలో చివరి రోజైన సద్దుల బతుకమ్మకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. గునుగు, తంగేడు, బంతి, చామంతి తదితర పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, మహిళలు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు.అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, కోలాటాలతో సందడి చేశారు. మహిళల ఆటపాటలు, రంగురంగుల పూల అలంకరణలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామీణ సంప్రదాయాలు, కుటుంబ అనుబంధాలు, ప్రకృతిపై ప్రేమను చాటిచెప్పే బతుకమ్మ పండుగను గ్రామస్థులు ఐక్యంగా నిర్వహించారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ హింగే రవీందర్, ఉప సర్పంచ్ రాంపాక రాజు మాట్లాడుతూ.. సద్దుల బతుకమ్మ పూల అందాల పండుగ మాత్రమే కాదని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. మహిళల ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు బతుకమ్మ నిదర్శనమని తెలిపారు. తరతరాలుగా వస్తున్న ఈ గొప్ప సంప్రదాయాలను కాపాడుకుంటూ, బతుకమ్మ వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఆడపడుచుల జీవితాల్లో సంతోషాలు వెల్లివిరియాలని, ప్రతి ఇంటా సిరిసంపదలు, సుఖశాంతులు నిండాలని ఆకాంక్షిస్తూ గ్రామ ప్రజలకు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.





ప్రమాదంలో గాయపడిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వీరాటి లింగారెడ్డికి చల్లా ధర్మారెడ్డి పరామర్శ

హనుమకొండ, అక్టోబర్ 18 (ప్రజానేస్తం జ్వాల):



వరంగల్ జిల్లా గీసుగొండ మండలం కొమ్మాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వీరాటి లింగారెడ్డి ప్రమాదవశాత్తు గాయపడి హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆసుపత్రికి వెళ్లి లింగారెడ్డిని పరామర్శించారు.ఈ సందర్భంగా లింగారెడ్డి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవనం కొనసాగించాలని ఆకాంక్షించారు. చల్లా ధర్మారెడ్డి వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

రెబ్బెన పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఐజీ అంబర్ కిషోర్ ఝా

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, అక్టోబర్ 18(ప్రజానేస్తం జ్వాల):



రెబ్బెన పోలీస్ స్టేషన్‌ను కాళేశ్వరం జోన్--I డీఐజీ అంబర్ కిషోర్ ఝా శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు, సీసీటీఎన్ఎస్ వ్యవస్థ, వివిధ విభాగాల పనితీరును పరిశీలించి, శాంతిభద్రతలు, నమోదైన కేసులు, పెండింగ్ కేసుల పురోగతిపై సమీక్షించారు. ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ మర్యాదపూర్వక సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిఘా పెంచి, ఆకస్మిక వాహన తనిఖీలతో విజిబుల్ పోలీసింగ్‌ను పటిష్టం చేయాలని ఎస్ఐ ఏ. వెంకటకృష్ణకు ఆదేశించారు.

తాళ్ల మల్కాపురంలో ఘనంగా మహా అన్నదానం.. భారీగా తరలివచ్చిన భక్తులు!

తాళ్ల మల్కాపురం:



గ్రామంలో శ్రీ దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీ రామాంజనేయ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. గ్రామ ప్రజలు, భక్తులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమానికి సహకరించిన గ్రామ ప్రజలు, పెద్దలు, దాతలు, ఇతర సహకారదారులకు శ్రీ రామాంజనేయ యూత్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అందరి భాగస్వామ్యంతో అన్నదానం సజావుగా నిర్వహించామని పేర్కొన్నారు.

అధిక శబ్ద పరికరాలు విక్రయిస్తే కఠిన చర్యలు

హనుమకొండ, అక్టోబర్ 18 (ప్రజానేస్తం జ్వాల):



బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా అధిక శబ్దాలు చేసే పీకలు, ఇతర ప్రమాదకర శబ్ద పరికరాలను విక్రయిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కేయూసీ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎస్. రవికుమార్ హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘించి ప్రజలకు ఇబ్బందులు కలిగించే పరికరాలను విక్రయించే వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.చిన్నపిల్లలు, యువత హానికరమైన శబ్ద పరికరాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అధిక శబ్దాల వల్ల వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజలు శబ్ద కాలుష్యానికి దూరంగా ఉంటూ, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పోలీస్ అధికారులు విజ్ఞప్తి చేశారు.

కాజీపేట మీదుగా బీదర్--అజ్నీ ప్రత్యేక రైళ్లు

హనుమకొండ, అక్టోబర్ 18 (ప్రజానేస్తం జ్వాల):



నాగ్‌పూర్‌లో ధమ్మచక్ర ప్రవర్తన్ దివస్ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే బీదర్--అజ్నీ (07081), అజ్నీ--బీదర్ (07082) ప్రత్యేక రైళ్లను నడపనుంది. ఈ రైళ్లు జహీరాబాద్, వికారాబాద్, లింగంపల్లి, బేగంపేట, సికింద్రాబాద్, చర్లపల్లి, కాజీపేట, మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్హార్షా మీదుగా రాకపోకలు సాగిస్తాయని రైల్వే అధికారులు తెలిపారు.

మామునూరు ఓపెన్ ఎయిర్ జైలును తనిఖీ చేసిన న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

హనుమకొండ, అక్టోబర్ 18 (ప్రజానేస్తం జ్వాల):



వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ శనివారం మామునూరు ఓపెన్ ఎయిర్ జైలును సందర్శించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జైలులోని లీగల్ ఎయిడ్ క్లినిక్ పనితీరును పరిశీలించారు.ఈ సందర్భంగా ఖైదీలకు అర్హత మేరకు ఉచిత న్యాయ సహాయం సకాలంలో అందించాలని అధికారులకు సూచించారు. అనంతరం బ్యారక్‌లలోని ఖైదీలతో మాట్లాడి వారి కేసుల వివరాలు, న్యాయపరమైన సమస్యలు, కేసుల ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో జైలర్ జలేందర్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి. శ్రీనివాసరావు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

సద్దుల బతుకమ్మ వేళ వరంగల్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

హనుమకొండ, అక్టోబర్ 18 (ప్రజానేస్తం జ్వాల):



సద్దుల బతుకమ్మ పండుగ, ఆదివారం సెలవు నేపథ్యంలో వరంగల్ ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. పండుగను కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి జరుపుకునేందుకు మహిళలు, ఇతర ప్రయాణికులు పెద్ద సంఖ్యలో స్వగ్రామాలకు బయలుదేరారు. అయితే, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని పలువురు ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. పండుగ సమయాల్లో ముందస్తు ప్రణాళికతో అదనపు బస్సులు, ట్రిప్పులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను కోరారు.

లలితా త్రిపురసుందరి అలంకారంలో శృంగేరి శారదాపీఠం అమ్మవారు

హనుమకొండ, అక్టోబర్ 18 (ప్రజానేస్తం జ్వాల):



వరంగల్‌లోని శ్రీ శృంగేరి శారదాపీఠంలో దుర్గాష్టమి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ శారదా అమ్మవారు లలితా త్రిపురసుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

హనుమకొండలో వీధికుక్కల దాడి.. ఏడేళ్ల బాలుడికి తీవ్ర గాయాలు


హనుమకొండ, అక్టోబర్ 18 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండలో వీధికుక్కల దాడి కలకలం రేపింది. ఎక్సైజ్ కాలనీ రోడ్డు నంబర్ 5లో ఏడేళ్ల అరవింద్‌పై సుమారు ఐదు వీధికుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు కుక్కలను తరిమివేసి, బాలుడిని చికిత్స కోసం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలుడు చికిత్స పొందుతున్నట్లు సమాచారం.ఈ ఘటనతో కాలనీవాసులు భయాందోళనలకు గురవుతున్నారు. జీడబ్ల్యూఎంసీ అధికారులు తక్షణమే స్పందించి వీధికుక్కల బెడదను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రైవేటు లాడ్జిలో డిప్యూటీ తహసీల్దార్ ఆత్మహత్య.. సూసైడ్ నోట్‌లో పలువురి పేర్లు

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 18 (ప్రజానేస్తం జ్వాల):



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. పాల్వంచలో సివిల్ సప్లైస్ శాఖ గ్యాస్ గోడౌన్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ అనంతలక్ష్మీనారాయణ ఓ ప్రైవేటు లాడ్జిలో ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం.తన మృతికి పలువురు కారణమంటూ ఆయన రాసినట్లు చెబుతున్న సూసైడ్ నోట్‌లో ఓ కంప్యూటర్ ఆపరేటర్ పేరుతో పాటు కొందరు వ్యక్తుల పేర్లు ఉన్నట్లు తెలుస్తోంది. వారంతా కలిసి తనను రూ. కోటి డిమాండ్ చేశారని, డబ్బులు ఇవ్వకపోతే తనపై లైంగిక వేధింపుల ఆరోపణలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని బెదిరించినట్లు లేఖలో పేర్కొన్నారని సమాచారం.అయితే, సూసైడ్ నోట్‌లోని ఆరోపణలు స్వతంత్రంగా ధ్రువీకరించబడాల్సి ఉంది. ఘటనపై పోలీసుల దర్యాప్తు, అధికారిక ప్రకటన వెలువడితేనే పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

దుర్గమ్మ సన్నిధిలో అన్నదానం.. భక్తులకు సేవ

గరిడేపల్లి, అక్టోబర్ 18 (ప్రజానేస్తం జ్వాల):



దుర్గమ్మ సన్నిధిలో భక్తులకు అన్నప్రసాదం అందించాలనే సంకల్పంతో మణికంఠ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీ, మాజీ జడ్పీటీసీ పెండెం సుజాత శ్రీనివాస్ గౌడ్, గరిడేపల్లి గ్రామ సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తులకు అన్నప్రసాదం అందించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. అన్నదానం ఆధ్యాత్మికతతో పాటు సేవాభావానికి, సామాజిక బాధ్యతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు.

అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం సౌండ్ సిస్టమ్ అందజేత

పొనుగోడు, అక్టోబర్ 18 (ప్రజానేస్తం జ్వాల):



పొనుగోడు గ్రామంలో అయ్యప్ప మాలధారణ చేసిన 100 మందికి పైగా స్వాములు శ్రీశ్రీశ్రీ త్రిలింగేశ్వర ఆలయంలో ఉంటూ ప్రతిరోజూ అయ్యప్ప పూజలు, భజనలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సౌండ్ సిస్టమ్ సౌకర్యం లేక ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని గుర్తించిన పొనుగోడు మెయిన్ రోడ్డుకు చెందిన గణేష్ యూత్ కమిటీ సభ్యులు చొరవ తీసుకున్నారు.అయ్యప్ప పూజలు, భజనలకు ఉపయోగపడేలా 240 వాట్ల బోట్ పార్టీ పాల్ స్పీకర్, 600 ప్లస్ బిగ్ స్పీకర్, వైర్‌లెస్ మైక్‌లను గురుస్వామి యర్రంశెట్టి వెంకన్నకు అందజేశారు. అయ్యప్ప స్వాములకు అవసరమైన సౌకర్యం కల్పించేందుకు ముందుకొచ్చిన గణేష్ యూత్ కమిటీ సభ్యులను భక్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు కొమరాజు, లచ్చది, ఆసంతు శివ, నక్క సుధాకర్, మద్దెమడుగు సైదులు, యల్లావుల దుర్గాప్రసాద్‌తో పాటు పలువురు అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదుకు బీఆర్ఎస్ ముందడుగు!

- **చింతలపాలెంలో ఉచిత దరఖాస్తు కేంద్రం ప్రారంభం**
- **హుజూర్‌నగర్ నియోజకవర్గవ్యాప్తంగా ఉచిత సేవలు.. అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు కావాలి: పిల్లుట్ల రఘు**



చింతలపాలెం, అక్టోబర్ 18 (ప్రజానేస్తం జ్వాల):

పట్టభద్రుల ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు కావాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ నాయకుడు పిల్లుట్ల రఘు ముందడుగు వేశారు. మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి మార్గదర్శకత్వంలో ఆయన ఆధ్వర్యంలో చింతలపాలెం మండల కేంద్రంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు కోసం ఉచిత దరఖాస్తు కేంద్రాన్ని ప్రారంభించారు. పట్టభద్రులకు దరఖాస్తు ప్రక్రియలో అవసరమైన సహకారం అందించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

పట్టభద్రులకు ఓటు హక్కుపై అవగాహన

హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ప్రతి మండలంలో అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకునేందుకు వీలుగా ఉచిత కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియలో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించి, అర్హులైన వారికి దరఖాస్తు చేసుకునే విషయంలో సహకారం అందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పిల్లుట్ల రఘు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, పట్టభద్రులు తమ హక్కును గుర్తించి ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత ముందుకు వచ్చి ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడికి నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

దరఖాస్తుకు అవసరమైన వివరాలు

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు కోసం సంప్రదించే వారు ఆధార్ కార్డు, డిగ్రీ మెమో, మొబైల్ నంబర్ వివరాలతో కేంద్ర నిర్వాహకులను సంప్రదించాలని సూచించారు. దరఖాస్తుకు అవసరమైన పత్రాలు, అర్హతలు, నమోదు గడువును అధికారిక ఎన్నికల మార్గదర్శకాల ప్రకారం నిర్ధారించుకోవాలని తెలిపారు.సంప్రదించాల్సిన నంబర్లు. చంటి: 960304666, రమేష్ రెడ్డి: 7416433369, వెంకట గౌడ్: 8897053344, పృధ్వీ: 6302493256,శివా రెడ్డి: 8106249306కేంద్రానికి నేరుగా రాలేని పట్టభద్రులు ఫోన్ ద్వారా సంప్రదించి దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన వివరాలు తెలుసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌తో పాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది.. అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థలో తన భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

- **నవంబర్ 5 చివరి తేదీ.. 34 రంగాల్లో ప్రతిభావంతులకు అవకాశం**



భీమదేవరపల్లి, అక్టోబర్ 18 (ప్రజా నేస్తం జ్వాల:

బాలల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు నవంబర్ 14 బాలల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డులు ప్రదానం చేయనున్నట్లు బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ తెలిపారు. 14 ఏళ్ల వయసు గల విద్యార్థులు తమ ప్రతిభకు సంబంధించిన మెరిట్ సర్టిఫికెట్లతో నవంబర్ 5 సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, క్రీడలు, యోగా, కరాటే, కవిత్వం తదితర 34 రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు బయోడేటా, ఫొటో, మెరిట్ సర్టిఫికెట్లు, పత్రికా కథనాలు జతచేసి వలస సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర అధ్యక్షుడు, బాలల హక్కుల ప్రజా వేదిక, ఇంటి నంబర్ 2-92, కూరెల్ల గ్రామం, కోహెడ మండలం, సిద్దిపేట జిల్లా--505473 చిరునామాకు పోస్టు ద్వారా పంపించాలని కోరారు. ప్రతిభావంతులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు!

పల్లెపల్లెనా పూల పండుగ సందడి..
ఆటపాటలతో అలరించిన ఆడపడుచులు



భీమదేవరపల్లి, అక్టోబర్ 18 (ప్రజా నేస్తం జ్వాల):

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలవ్యాప్తంగా ఆదివారం ఘనంగా జరిగాయి. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ ఆడపడుచులు చేరి ఆటపాటలతో సందడి చేయడంతో పల్లెలన్నీ పండుగ శోభను సంతరించుకున్నాయి. ముల్కనూరు మేజర్ గ్రామపంచాయతీలో సర్పంచ్‌తో పాటు ఎస్సై బతుకమ్మను ఎత్తుకుని వేడుకల్లో పాల్గొన్నారు. మండల కేంద్రం భీమదేవరపల్లిలో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ముత్తారం, వంగర, రాంనగర్, గట్ల నర్సింగాపూర్, బొల్లోనిపల్లి, ముస్తఫాపూర్, కొత్తకొండ, ధర్మారం, మల్లారం తదితర గ్రామాల్లో సర్పంచులు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో మహిళలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. పూల బతుకమ్మల సందడితో మండలవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది.

మాజీ ఎంపీటీసీ వెంకట్రాం నాయక్‌కు బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

అనారోగ్యం నుంచి కోలుకుంటున్న నాయకుడికి ఆత్మీయ భరోసా.. అండగా ఉంటామని హామీ


గరిడేపల్లి, అక్టోబర్ 18 (ప్రజానేస్తం జ్వాల):

గరిడేపల్లి మండలం గారకుంట తండాకు చెందిన మాజీ ఎంపీటీసీ గుగులోతు వెంకట్రాం నాయక్‌ను బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. ఇటీవల సోమాజిగూడలోని అపోలో ఆసుపత్రిలో ఎడమ చెవికి శస్త్రచికిత్స చేయించుకుని ఇంటికి చేరుకున్న ఆయనను గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు స్వగృహంలో కలిసి ఆత్మీయంగా పలకరించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నాయకులు వెంకట్రాం నాయక్‌కు మనోధైర్యం కల్పిస్తూ, ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కష్టసమయాల్లో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రాజకీయాలకు అతీతంగా ఆత్మీయ సంబంధాలను కొనసాగించడం, అనారోగ్యంతో ఉన్నవారికి ధైర్యం చెప్పడం సామాజిక బాధ్యత అని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుగులోతు నీలాహేమ్లా నాయక్‌తో పాటు మండల బీఆర్ఎస్ నాయకుడు గుగులోతు బాలు నాయక్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు సందీప్ నాయక్, మాజీ నీటి సంఘం డైరెక్టర్ వెంకట్రాం నాయక్, సర్దార్ నాయక్, నరేందర్ నాయక్, లకుపతి నాయక్, రవీందర్ నాయక్, నందా నాయక్, శ్రీను నాయక్, బచ్చలకూరి కోటయ్య, నాగు నాయక్, లింగ నాయక్, లాలు నాయక్, గాంధీలాల్, రవి నాయక్, శ్రీను డోల తదితరులు పాల్గొన్నారు.



కాగజ్ నగర్‌లో ఉరివేసుకుని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాగజ్ నగర్, అక్టోబర్ 18 (ప్రజానేస్తం జ్వాల):



కాగజ్ నగర్ మండలం కోసిని ప్రధాన రహదారి పక్కన ఉన్న పొదల్లో ఓ గుర్తుతెలియని వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందిన ఘటన వెలుగుచూసింది. చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు ఎవరనే విషయం ఇంకా తెలియరాలేదు. ఘటనకు గల కారణాలపై కూడా స్పష్టత రావాల్సి ఉంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించే అవకాశం ఉంది. పోలీసుల విచారణ అనంతరం మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

నూతన ఎస్సైను మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు




భీమదేవరపల్లి, అక్టోబర్ 18 (ప్రజా నేస్తం జ్వాల):

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని రాంనగర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం వంగర పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సైను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సైకు శుభాకాంక్షలు తెలియజేసి, పరస్పరం పరిచయాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాంనగర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సయ్యద్ బాషాతో పాటు నాయకులు భూక్య ప్రవీణ్, కదిరే బాబు, ముజీప్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ కలెక్టరేట్‌లో రేపటి ప్రజావాణి రద్దు: జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ వెల్లడి!

హనుమకొండ, అక్టోబర్ 18 (ప్రజానేస్తం జ్వాల-ప్రతినిధి):

హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నాడు నిర్వహించాల్సిన ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పరిపాలనా పరమైన కారణాల వల్ల రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించేందుకు వచ్చే ప్రజలు, ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కలెక్టర్ కోరారు. తిరిగి వచ్చే సోమవారం నాడు ఎప్పటిలాగే ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు ఇబ్బంది పడకుండా ఈ సమాచారాన్ని గమనించాలని సూచించారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

దసరా పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

- ప్రజల భద్రతకు పోలీసుల నిరంతర పర్యవేక్షణ
- జిల్లా ఎస్పీ కె. నరసింహ, ఐపీఎస్

సూర్యాపేట, అక్టోబర్ 18 (ప్రజానేస్తం జ్వాల):

దసరా పండుగను జిల్లా ప్రజలందరూ సంతోషంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ కె. నరసింహ, ఐపీఎస్ సూచించారు. పండుగ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు. ప్రజలు మహిళలను గౌరవిస్తూ, ఇతరుల మనోభావాలను దెబ్బతీయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. బెట్టింగ్‌లు, జూదం, గొడవలు, తగాదాలకు దూరంగా ఉంటూ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని సూచించారు.దసరా సెలవుల్లో ప్రయాణాలు చేసే వారు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని ఎస్పీ స్పష్టం చేశారు. ఎక్కువ రోజులు ఇంటికి తాళం వేసి వెళ్లేవారు విలువైన వస్తువుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఇంటి భద్రత కోసం సీసీ కెమెరాలు, అలారం వ్యవస్థలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.పండుగకు స్వగ్రామాలకు వచ్చే యువత గ్రామాల్లో శాంతియుత వాతావరణాన్ని కాపాడాలని, ఎలాంటి గొడవలకు పాల్పడకూడదని కోరారు. తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరించి దసరా పండుగను సురక్షితంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ కోరారు. అత్యవసర సమయంలో డయల్ 112కు లేదా సూర్యాపేట జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్లు 8712686026, 8712686057కు ఫోన్ చేయాలని సూచించారు. లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు.



పూల జాతరతో పులకించిన ఓరుగల్లు.. పద్మాక్షి గుట్టపై వైభవంగా సద్దుల బతుకమ్మ సంబురాలు!





- జానపద గేయాలు.. మహిళల ఆటపాటలు.. రంగురంగుల పూల బతుకమ్మలతో కనులపండువగా వేడుకలు

హనుమకొండ, అక్టోబర్ 18 (ప్రజానేస్తం జ్వాల):

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు చారిత్రక ఓరుగల్లు నగరంలో అంబరాన్నంటాయి. హనుమకొండలోని శ్రీ పద్మాక్షి అమ్మవారి ఆలయం, పద్మాక్షి గుట్ట రోడ్డు పరిసరాలు ఆదివారం సాయంత్రం రంగురంగుల పూల బతుకమ్మలతో కళకళలాడాయి. తెలంగాణ ఆడపడుచులు సంప్రదాయ దుస్తుల్లో తరలివచ్చి, బతుకమ్మలను అందంగా పేర్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మహిళల కోలాటాలు, జానపద గేయాలు, సందడితో పరిసర ప్రాంతాలు పండుగ శోభను సంతరించుకున్నాయి.

పూల అందాలతో కనువిందు చేసిన బతుకమ్మలు

సాయంత్రం నుంచే మహిళలు, యువతులు సంప్రదాయ పట్టుచీరలు, లంగాఓణీలు ధరించి తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను తీసుకుని పద్మాక్షి గుట్టకు చేరుకున్నారు. గునుగు, తంగేడు, బంతి, చామంతి, గులాబీ తదితర పూలతో గోపురాకారంలో అలంకరించిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బతుకమ్మల చుట్టూ వలయాకారంగా చేరిన మహిళలు లయబద్ధంగా చప్పట్లు కొడుతూ సంప్రదాయ నృత్యాలు చేశారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలతో పద్మాక్షి రోడ్డు పూలవనాన్ని తలపించింది.

జానపద గేయాలతో మార్మోగిన పద్మాక్షి పరిసరాలు

బతుకమ్మ పాటలు, మహిళల ఆటపాటలతో పండుగ ప్రాంగణం సందడిగా మారింది. 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో' అంటూ మహిళలు ఆలపించిన జానపద గేయాలు పరిసర ప్రాంతాల్లో మార్మోగాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు పలువురు మహిళలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. తరతరాలుగా వస్తున్న బతుకమ్మ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ తెలంగాణ సంస్కృతి, మహిళల ఐక్యతను చాటిచెప్పారు.

విద్యుత్ కాంతుల్లో ఆలయ పరిసరాలు

సద్దుల బతుకమ్మ వేడుకలకు పెద్ద సంఖ్యలో మహిళలు తరలిరావడంతో పద్మాక్షి గుట్ట పరిసరాలు జనసందోహంతో కళకళలాడాయి. ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించగా, పండుగ వాతావరణం మరింత ఆకర్షణీయంగా మారింది. మహిళలకు ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లను అధికారులు, స్థానిక కమిటీలు పర్యవేక్షించగా, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సంప్రదాయబద్ధంగా బతుకమ్మ నిమజ్జనం

ఆటపాటల అనంతరం మహిళలు బతుకమ్మలను పద్మాక్షి గుండం వద్దకు తీసుకెళ్లి సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేశారు. గౌరమ్మకు భక్తితో వీడ్కోలు పలుకుతూ కుటుంబాలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. అనంతరం ఒకరికొకరు వాయనాలు ఇచ్చిపుచ్చుకుంటూ, సద్దుల ప్రసాదాలను పంచుకున్నారు. దీంతో పద్మాక్షి గుట్ట పరిసరాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ముగిశాయి.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మరోసారి ఓరుగల్లు నగరంలో సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పింది.

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో కరువు పరిస్థితులు: జగదీష్ రెడ్డి

సూర్యాపేట, అక్టోబర్ 18 (ప్రజానేస్తం జ్వాల):

తెలంగాణలో ప్రస్తుత కరువు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో ఏం చేయాలో తెలియక ప్రభుత్వం చేతులెత్తేస్తోందని, ముఖ్యమంత్రి, మంత్రులు ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా స్కాములు, వాటాల కోసమే పనిచేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో నీళ్లు, విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులపై మీడియాతో మాట్లాడారు.

కరువుకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

రాష్ట్రంలో కరువు పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయని జగదీష్ రెడ్డి అన్నారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని నిపుణులు ఏడాది ముందుగానే హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కరువుకు ఎల్‌నినో ఒక్కటే కారణం కాదని, ప్రభుత్వ నిర్లక్ష్యం కూడా ప్రధాన కారణమని ఆరోపించారు. నీటి వనరులను సమర్థంగా వినియోగించి ఉంటే రైతులకు ఈ పరిస్థితులు ఎదురయ్యేవి కావని అన్నారు.

తెలంగాణ నీళ్లు ఇతర రాష్ట్రాలకు.. రైతులకు ఇబ్బందులు

కృష్ణా జలాల్లో తెలంగాణకు అందుబాటులో ఉన్న నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని జగదీష్ రెడ్డి ఆరోపించారు. ఇప్పటివరకు కృష్ణా నది నుంచి రాష్ట్రం 18 టీఎంసీల నీటిని కూడా వినియోగించుకోలేదని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి ప్రవహిస్తున్న నీటితో ఆంధ్రప్రదేశ్ ప్రయోజనం పొందుతోందని విమర్శించారు.కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ప్రారంభించి ఉంటే చెరువులు, ప్రాజెక్టులు నీటితో నిండేవని, గోదావరి నుంచి 250 టీఎంసీల నీటిని ఎత్తిపోసుకునే అవకాశం ఉండేదని అన్నారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో వ్యవసాయానికి నీటి లభ్యత పెరిగిందని పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాపైనా ప్రభుత్వంపై విమర్శలు

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ నిరంతర విద్యుత్ సరఫరాలో గుర్తింపు పొందిందని జగదీష్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్, సాగునీటి సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని విమర్శించారు. యాదాద్రి పవర్ ప్లాంట్ విషయంలో ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిపోయి ఉద్యోగులను బాధ్యులను చేసే ప్రయత్నం ఎందుకని ప్రశ్నించారు.



సింగరేణిని బదనాం చేస్తున్నారని ఆరోపణ

ప్రైవేటు బొగ్గు సంస్థల నుంచి కమిషన్లకు ఆశపడి సింగరేణి సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని జగదీష్ రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఉద్యోగులపైకి నెట్టే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. రాష్ట్రంలోని సహజ వనరులను సమర్థంగా వినియోగించకుండా ఇతర రాష్ట్రాలకు ప్రయోజనం చేకూర్చేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు.

చేతకాకపోతే మాకు అప్పగించండి

రాష్ట్రంలో విద్యుత్, నీటి సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని జగదీష్ రెడ్డి విమర్శించారు. విద్యుత్, సాగునీటిని ఎలా అందించాలో తమకు తెలుసని, ప్రభుత్వం వల్ల కాకపోతే బాధ్యతలు తమకు అప్పగించాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలోని సమస్యలను ఉద్యోగులు, రైతులు, అన్ని రంగాల ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.కేసీఆర్ తిరిగి అధికారంలోకి వస్తే రాష్ట్రంలో గతంలో అమలు చేసిన విధానాలను పునరుద్ధరించి, విద్యుత్, సాగునీటి రంగాలను తిరిగి గాడిలో పెడతామని ధీమా వ్యక్తం చేశారు.ఈ మీడియా సమావేశంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట జిల్లా బీజేవైఎం కార్యదర్శిగా నర్సింగ్ వినయ్ కుమార్ గౌడ్

- 35 మందితో జిల్లా కార్యవర్గం ప్రకటన.. యువత సేవే లక్ష్యంగా ముందడుగు!

సూర్యాపేట, అక్టోబర్ 18 (ప్రజానేస్తం జ్వాల):



భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) సూర్యాపేట జిల్లా కార్యవర్గాన్ని 35 మందితో ఆదివారం ప్రకటించారు. ఇందులో భాగంగా జిల్లా కార్యదర్శిగా నర్సింగ్ వినయ్ కుమార్ గౌడ్‌ను నియమించినట్లు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు గుణగంటి పృథ్వి గౌడ్ వెల్లడించారు.యువతను సామాజిక సేవ వైపు నడిపించడం, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం, దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా నూతన కార్యవర్గం పనిచేయనుంది. స్వామి వివేకానంద ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు సమాజ సేవా కార్యక్రమాల్లో వారిని భాగస్వాములను చేయడంపై దృష్టి సారించనున్నారు. జిల్లా కార్యదర్శిగా నియమితులైన నర్సింగ్ వినయ్ కుమార్ గౌడ్ పార్టీ బలోపేతానికి, యువతను సంఘటితం చేయడానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. యువత సంక్షేమం, సామాజిక అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించనున్నారు.

కొత్తకొండలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీ భద్రకాళి దుర్గాదేవి

- శరన్నవరాత్రుల ఎనిమిదో రోజు మహాగౌరీ అలంకారంలో అమ్మవారు.. ప్రత్యేక పూజలతో మార్మోగిన ఆలయం

భీమదేవరపల్లి, అక్టోబర్ 18 (ప్రజా నేస్తం జ్వాల):



శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భద్రకాళి అమ్మవారి జన్మోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారిని శ్రీ భద్రకాళి దుర్గాదేవి అలంకారంలో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు.ఉత్సవాల్లో ఎనిమిదో రోజు భాగంగా గణపతి పూజ, శైవశుద్ధి, పుణ్యాహవచనం, సర్వతోభద్ర మండల ఆవాహన, చతుఃషష్టి ఉపచార పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం మహాగౌరీ దుర్గార్చనతో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారి దివ్య అలంకరణను దర్శించుకున్న భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. శరన్నవరాత్రి వేడుకలతో కొత్తకొండ ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో అర్చకులు రాంబాబు, జానకిపురం రవి శర్మ, వినయ్ శర్మ, భక్తులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

రైస్ మిల్లు కార్మికుల వేతనాలు, అలవెన్సులు పెంచాలి

- పెరిగిన నిత్యావసర ధరలతో కార్మిక కుటుంబాలపై ఆర్థిక భారం
- టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి

హుజూర్‌నగర్, అక్టోబర్ 18 (ప్రజానేస్తం జ్వాల):



పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా రైస్ మిల్లుల్లో పనిచేస్తున్న డ్రైవర్లు, దినసరి కూలీల వేతనాలు, అలవెన్సులు పెంచాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి రైస్ మిల్లుల యాజమాన్యాలను కోరారు. ధరల పెరుగుదలతో కార్మిక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో యాజమాన్యాలు సానుకూలంగా స్పందించి వేతనాల పెంపునకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఆదివారం హుజూర్‌నగర్ మార్కెట్ యార్డులో తురక రమేష్ అధ్యక్షతన నిర్వహించిన రైస్ మిల్లు కార్మికుల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రైస్ మిల్లు డ్రైవర్ల రెండేళ్ల వేతన ఒప్పందం ఈ నెల 31వ తేదీతో ముగియనుండగా, దినసరి కూలీల ఒప్పందం డిసెంబర్ 31తో ముగియనుందని తెలిపారు.రెండేళ్లకోసారి వేతనాలు, అలవెన్సులు పెంచాల్సి ఉన్నందున కార్మికులందరితో చర్చించి, తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శుల ద్వారా యాజమాన్యాలకు అందించాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించినట్లు వెల్లడించారు.ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు గణనీయంగా పెరిగాయని, కిలో బియ్యం ధర రూ.40 నుంచి రూ.80 వరకు పలుకుతోందని రోషపతి పేర్కొన్నారు. వంటనూనెతో పాటు ఇతర నిత్యావసరాల ధరలు కూడా పెరగడంతో కార్మికులు తమ కుటుంబాల పోషణకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్మికుల శ్రమకు తగిన ప్రతిఫలం అందేలా వేతనాలు, అలవెన్సులు పెంచి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని యాజమాన్యాలను కోరారు.ఈ సమావేశంలో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గుండెబోయిన వెంకన్న యాదవ్, కంకణాల రామయ్య, తురక రమేష్, వెంకన్న, స్వరూప, నాగమణి, నాగరాజు, శ్రీనివాస్, జానకిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉర్సు రంగలీలా మైదానంలో ఘనంగా సద్దుల బతుకమ్మ: మహిళలతో కలిసి ఆడిపాడిన ఎమ్మెల్యే కొండా సురేఖ

హనుమకొండ, అక్టోబర్ 18 (ప్రజానేస్తం జ్వాల– ప్రతినిధి : మారెల్లి కిరణ్):



వరంగల్ ఉర్సు రంగలీలా మైదానంలో అత్యంత వైభవంగా నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మైదానంలో కొలువుదీరిన భారీ బతుకమ్మను తలపై ఎత్తుకుని మైదానానికి చేరుకున్న ఆమె, స్థానిక మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ, పాడుతూ ఉత్సాహంగా సందడి చేశారు. తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ఆడపడుచుల ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. తలపై రంగురంగుల పెద్ద బతుకమ్మలను ఎత్తుకుని వేడుకలకు తరలివచ్చిన మహిళా లోకానికి ఆమె బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ఖిలా వరంగల్ తూర్పుకోటలో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు

- ఆడపడుచులకు ఇబ్బందులు కలగకుండా అఖిలపక్ష నాయకుల ఏర్పాట్లు.. పాల్గొన్న మహిళలకు బహుమతుల ప్రదానం

ఖిలా వరంగల్, ప్రజానేస్తం జ్వాల:



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు ఖిలా వరంగల్ తూర్పుకోటలో అంగరంగ వైభవంగా జరిగాయి. తెలంగాణ ఆడపడుచులు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అఖిలపక్ష నాయకులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు.


మహిళలకు ప్రత్యేక సౌకర్యాలు

బతుకమ్మ వేడుకలకు హాజరైన మహిళలకు అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పండుగలో పాల్గొన్న వారికి తాగునీటి సౌకర్యం కల్పించారు. మహిళలు ఆనందోత్సాహాలతో వేడుకలను జరుపుకునేలా ఏర్పాట్లు చేయడంతో పండుగ ప్రాంగణం సందడిగా మారింది. కాకతీయ పెరిక పరపతి సంఘం ఆధ్వర్యంలో బహుమతుల ప్రదానం బతుకమ్మ సంబరాల్లో భాగంగా కాకతీయ పెరిక పరపతి సంఘం ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయడంతో పాటు, వేడుకల్లో పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం మహిళల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ పండుగ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని స్థానికులు పేర్కొన్నారు. అందరూ కలిసికట్టుగా పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

జోడేఘాట్‌లో కుమ్రం భీం 86వ వర్ధంతి.. పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి

- ఈ నెల 26న జరిగే వర్ధంతి కార్యక్రమానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం అందజేసిన నిర్వహణ కమిటీ సభ్యులు

ఆసిఫాబాద్, అక్టోబర్ 18 (ప్రజానేస్తం జ్వాల):



ఆదివాసీ హక్కుల పోరాట యోధుడు కుమ్రం భీం 86వ వర్ధంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని జోడేఘాట్‌లో ఈ నెల 26న నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆవిష్కరించారు.ఆదివారం ఆసిఫాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో భీం వర్ధంతి నిర్వహణ కమిటీ సభ్యులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి, వర్ధంతి కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం కార్యక్రమ ప్రచార పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జోడేఘాట్‌లో నిర్వహించనున్న కుమ్రం భీం వర్ధంతి కార్యక్రమానికి సంబంధించిన వివరాలను కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు వివరించారు. వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నిర్వహణ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

తొర్రూరులో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు, అక్టోబర్ 18 (ప్రజానేస్తం జ్వాల):



మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలో బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకల్లో ఆడపడుచులు ఆటపాటలతో సందడి చేశారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పాల్గొని మహిళలతో కలిసి సంబరాల్లో భాగస్వాములయ్యారు. మహిళలకు ఇబ్బందులు కలగకుండా మున్సిపాలిటీ సిబ్బంది, నాయకులు తాగునీటితో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించారు.

ఈ సమస్య ఉన్నా సరైన తిండి తింటే బరువు తగ్గడం పెద్ద కష్టమేం కాదట

పీసీఓఎస్ ఒకసారి వచ్చిన తర్వాత చాలా కాలం పాటు సమస్యలు కలిగిస్తుంది. ఇది మహిళల్లో హార్మోన్ల అసమతుల్యత వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా బరువు పెరగడం చాలా సాధారణం. కొంతమంది మాత్రం బరువు తగ్గలేమనుకుంటారు. కానీ ఇది కరెక్ట్ కాదు. సరైన ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్పులతో బరువును తగ్గించవచ్చు.పీసీఓఎస్ ఉన్న వారిలో ఇన్సులిన్ హార్మోన్ సరిగా పని చేయదు. దీని వలన గ్లూకోజ్ స్థాయిలు పెరిగి శరీరానికి ఇన్సులిన్ తగిన విధంగా స్పందించదు. దీని ఫలితంగా శరీరం కొవ్వును నిల్వ చేసుకుంటుంది. ఇలా శరీర బరువు పెరుగుతుంది. అయితే ప్రతిరోజూ తినే ఆహారంలో చిన్న చిన్న మార్పులు చేయడం వల్ల బరువును తగ్గించవచ్చు.పొట్టలో ఉండే మంచి బ్యాక్టీరియా జీర్ణక్రియను మెరుగుపరచి బరువును నియంత్రించేందుకు సహాయం చేస్తుంది. కానీ పీసీఓఎస్ ఉన్నవారిలో ఈ మంచి బ్యాక్టీరియా తక్కువగా ఉంటుంది. అందుకే పెరుగు, చద్దన్నం, పచ్చళ్ళు, ఇడ్లీ, దోసె లాంటి పులియబెట్టిన పదార్థాలు తీసుకోవడం మంచిది.ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తినడం వల్ల ఎక్కువసేపు ఆకలేయదు. ఇది ఇన్సులిన్ నిరోధకతను తగ్గిస్తుంది. దీర్ఘకాలంగా వాపు ఉండడం వల్ల బరువు పెరగడం జరుగుతుంది. దీన్ని తగ్గించేందుకు మెడిటెరేనియన్ డైట్ ఉపయోగపడుతుంది. ఇందులో పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ఆలివ్ నూనె వంటివి ఉండాలి. అలాగే ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉండే చేపలను ఆహారంలో చేర్చటం శరీరానికి మేలు చేస్తుంది. కొవ్వులంటే బరువు పెరుగుతుందనే భయం చాలా మందిలో ఉంటుంది. కానీ మంచి కొవ్వులు శరీరానికి మేలు చేస్తాయి. అవకాడో, ఆలివ్ నూనె, నట్స్, కొబ్బరి నూనె వంటివి తినడం వల్ల ఆకలిని తగ్గించవచ్చు. దీని వలన బరువు తగ్గడం సులభమవుతుంది. కేవలం క్యాలరీలు తగ్గిస్తే సరిపోదు. ప్రాసెస్ చేసిన ఆహారాలు, జంక్ ఫుడ్ నుంచి దూరంగా ఉండాలి. గుడ్లు, పాలు, మాంసం, చేపలు లాంటి ప్రోటీన్ ఉన్న ఆహారం తినడం వల్ల ఎక్కువ సేపు ఆకలేయదు. ప్రతివారం కనీసం మూడు రోజులు బరువులెత్తే వ్యాయామాలు చేయడం వల్ల నడుము చుట్టూ ఉన్న కొవ్వు కరిగిపోతుంది. పూర్తి నిద్ర, ఒత్తిడి తగ్గించే యోగా, ధ్యానం చేయడం వల్ల కూడా బరువు తగ్గడంలో సహాయం చేస్తాయి.

అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు.. పల్లెపల్లెనా పూల పండుగ సందడి!

- రంగురంగుల పూల బతుకమ్మలతో పండుగ శోభ.. ఆటపాటలతో అలరించిన ఆడపడుచులు

భీమదేవరపల్లి, అక్టోబర్ 18 (ప్రజానేస్తం జ్వాల):



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలవ్యాప్తంగా ఆదివారం అంబరాన్నంటాయి. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ ఆడపడుచులు చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. మహిళల కోలాహలం, పూల పరిమళాలతో పల్లెలన్నీ పండుగ శోభను సంతరించుకున్నాయి.

ముల్కనూరులో ప్రత్యేక ఆకర్షణగా వేడుకలు!

ముల్కనూరు మేజర్ గ్రామపంచాయతీలో బతుకమ్మ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సర్పంచ్‌తో పాటు ఎస్సై బతుకమ్మను ఎత్తుకుని వేడుకల్లో పాల్గొనడం విశేషంగా నిలిచింది. మండల కేంద్రం భీమదేవరపల్లిలోనూ బతుకమ్మ సంబరాలు వైభవంగా జరిగాయి. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను ఆడిస్తూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు.

గ్రామగ్రామాన పూల పండుగ కోలాహలం!

ముత్తారం, వంగర, రాంనగర్, గట్ల నర్సింగాపూర్, బొల్లోనిపల్లి, ముస్తఫాపూర్, కొత్తకొండ, ధర్మారం, మల్లారం తదితర గ్రామాల్లో బతుకమ్మ వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి. గ్రామ సర్పంచులు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంబరాలు జరుపుకున్నారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మమేకమైన జీవన సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగతో భీమదేవరపల్లి మండలంలోని ప్రతి గ్రామం పూలవనంగా మారింది. సంప్రదాయాలు, సామూహిక ఐక్యతను చాటుతూ సాగిన ఈ వేడుకలు పల్లె ప్రజల్లో ఆనందోత్సాహాలను నింపాయి.

15 ఏళ్లుగా నిర్విరామంగా బతుకమ్మ సంబరాలు.. కీతవారిగూడెంలో తెలంగాణ సంస్కృతి వైభవం!







- తెలంగాణ ఉద్యమ జేఏసీ నాయకులు, గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో వేడుకలు
- ట్యాంక్‌బజార్‌లో ఆటపాటలతో ఆడపడుచుల సందడి.. విజేతలకు బహుమతుల ప్రదానం

కీతవారిగూడెం, అక్టోబర్ 18 (ప్రజానేస్తం జ్వాల):

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామంలో అంగరంగ వైభవంగా జరిగాయి. తెలంగాణ ఉద్యమ జేఏసీ నాయకులు, గ్రామ సర్పంచ్ బొల్లెపల్లి రామనాథం, గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో గత 15 ఏళ్లుగా బతుకమ్మ వేడుకలను నిర్విరామంగా నిర్వహిస్తూ గ్రామంలో సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

ట్యాంక్‌బజార్‌లో ప్రత్యేక సందడి

గ్రామంలోని ట్యాంక్‌బజార్‌లో వార్డు నంబర్ 6 సభ్యుడు మొగిలి సైదులు, వార్డు నంబర్ 5 సభ్యురాలు భూతం సరిత నాగరాజు ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. దీంతో ట్యాంక్‌బజార్ పండుగ శోభను సంతరించుకుంది.

బొడ్రాయి బజార్‌లో ప్రత్యేక సందడి

గ్రామంలోని బొడ్రాయిబజార్‌లో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పురోహితులు బ్రహ్మ శ్రీ రాయప్రోలు శ్రీరామయ్య శర్మ పాల్గొని సందడి చేయడం ప్రత్యేక ఆకర్షణగా మారింది, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

వేడుకల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేసి అభినందించారు. మహిళల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

15 ఏళ్లుగా సంప్రదాయానికి కొనసాగింపు

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో ప్రారంభమైన బతుకమ్మ సంబరాలను కీతవారిగూడెంలో 15 ఏళ్లుగా నిరంతరాయంగా నిర్వహించడం విశేషం. ప్రతి ఏడాది గ్రామ మహిళలు, యువత, స్థానికులు ఉత్సాహంగా పాల్గొంటూ ఈ వేడుకలను విజయవంతం చేస్తున్నారు. పూల పండుగ ద్వారా మహిళల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు కృషి చేస్తున్నారు. గ్రామంలో ఏటా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే



శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగినప్పుడు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యలు ముఖ్యంగా ఆర్థరైటిస్, కిడ్నీ సంబంధిత వ్యాధుల రూపంలో కనిపిస్తాయి. అధిక యూరిక్ యాసిడ్ కారణంగా జాయింట్లలో నొప్పులు, వాపులు మొదలవుతాయి. గ్రీన్ కలర్ ఫుడ్స్ దినచర్యలో భాగం చేస్తే ఈ సమస్యను సహజంగా నివారించవచ్చు. పాలకూరలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇందులో ఉన్న మెగ్నీషియం శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. పాలకూరను రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి పుష్కలమైన పోషకాలు అందించడమే కాక.. ఆరోగ్యాన్ని కాపాడేందుకు సహాయపడుతుంది.పచ్చి బఠానీలలో ఫైబర్ అధికంగా ఉంటుంది.. ఇది శరీరానికి కావలసిన శక్తిని అందిస్తుంది. వీటిలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని డిటాక్స్ చేయడంలో తోడ్పడతాయి. గౌట్ వంటి సమస్యలను తగ్గించడానికి ఈ బీన్స్ చాలా ఉపయోగపడతాయి.గ్రీన్ టీ శరీరంలోని హానికరమైన వ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఈ టీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఆహ్లాదకరమైన రుచి యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో తోడ్పడతాయి. ప్రతిరోజూ ఒక కప్పు గ్రీన్ టీ తాగడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చు. సెలరీలో ఉన్న పోషకాలు మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తాయి. ఇది శరీరంలోని వాపును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ఈ ఆకుకూర సహాయపడుతుంది. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ఈ పండు శరీరానికి అవసరమైన ఎనర్జీ అందించే ప్రక్రియను మెరుగుపరుస్తుంది. ఇది శరీరంలోని వ్యర్థ పదార్థాలను వెలుపలికి పంపడంలో సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని తగ్గించడానికి అవకాడో ఉపయోగపడుతుంది. ఆస్పరాగస్‌లో ఫైబర్, ప్యూరిన్లు సమతుల్యంగా ఉంటాయి. ఇది శరీరంలోని హానికరమైన పదార్థాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కాబట్టి ఆస్పరాగస్ ను తగిన మోతాదులో తీసుకోవడం మంచిది.గ్రీన్ బీన్స్ లో ప్యూరిన్లు తక్కువగా ఉంటాయి.. అందుకే ఇవి యూరిక్ యాసిడ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి.